
# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3




చిత్తూరు

జిల్లా వార్తలు


ఆదివారం 1 సెప్టెంబరు 2024




స్వామి పాదముద్ర వెలసిన ప్రదేశం







రాతిగుహలు - ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన నీటి చెలమలు

# బోడికొండకు మహర్దశ

● వెంకటేశ్వరాలయ పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే చొరవ

చిత్తూరు నగర శివారులోని బోడికొండ అభివృద్ధికి ముందడుగు పడింది. తిరుమలకు వెంకటేశ్వరస్వామి వెళుతూ బోడికొండపై తొలిపాదం మోపారని, పెనుమూరు మండలం కలికిరి కొండపై మరో పాదం మోపారన్న ప్రచారం భక్తుల్లో చాలాకాలంగా ఉంది. కంచి పీఠాధిపతి చంద్రశేఖర సరస్వతి 1980లో చిత్తూరుకు వచ్చినప్పుడు ఈ విషయాన్ని చెప్పడంతో బోడికొండకు ఆధ్యాత్మిక గుర్తింపు లభించింది. ఇక్కడున్న పాదముద్రికకు భక్తులు పూజలు చేస్తున్నారు. పాదముద్రిక చుట్టూ మూడు వైపులా మూడు చిన్న నీటి చెలమలున్నాయి. వాటిని సప్తకన్నికల, శ్రీవారి నిత్యకైంకర్య, కుసుమ ధార పుష్కరిణులుగా వ్యవహరిస్తూ పూజలు చేస్తున్నారు. వెంకటేశ్వర స్వామి పాదముద్రిక చుట్టూ పురాతన ఆలయ కట్టడం, ప్రహరీ, బురుజులు దెబ్బతిని ఉన్నాయి.

- చిత్తూరు కల్చరల్

## అడపాదడపా పూజలు



స్వామివారి పాదముద్ర

బోడికొండ దిగువ భాగంలో మృత్యుంజయ వీరాంజనేయస్వామి ఆలయం ఉంది. కొండ పైనుంచి చిత్తూరు నగరం వీక్షకులకు కను విందు చేస్తుంది. పెనుమూరు మండలం పులిగుండు ఇక్కడి నుంచి నేరుగా కనిపిస్తుంది. పర్వదినాల్లో మాత్రం నగరవాసులు బోడికొండకు వెళ్లి పూజలు చేస్తున్నారు. చిత్తూరు మాజీ ఎంపీ డీకే ఆదికేశవులు బోడికొండను అభివృద్ధి చేసేందుకు పలుమార్లు ప్రయత్నించినా కార్యరూపం దాల్చలేదు. ఈ నేపథ్యంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కమిటీ నాయకులు బోడికొండ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారు. అక్కడ వెంకటేశ్వరాలయం పునర్నిర్మాణం చేయాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను అభ్యర్థించారు. కొండపైకి భక్తులు వెళ్లడానికి దారి, తిరువణ్ణామలై తరహాలో ప్రతి పౌర్ణమికీ గిరి ప్రదక్షిణకు చర్యలు చేపట్టాలని కోరారు. బోడికొండ చుట్టూ 10 కిలో మీటర్ల విస్తీర్ణంతో వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉండటంతో అన్యాక్రాంతం కాకుండా ఆలయాన్ని అభివృద్ధి చేస్తే మరో చిన్న తిరుపతిగా ప్రసిద్ధి చెందుతుందని వివరించారు. స్థపతి రత్నామాచారితో కలసి ఆలయ నిర్మాణ మ్యాప్‌ను ఎమ్మెల్యేకు అందించారు. దీంతో ఎమ్మెల్యే బోడికొండను పరిశీలించమని సంబంధిత అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, ల్యాండ్ సర్వే అధికారులు బోడికొండపై ఉన్న పురాతన ఆలయ నిర్మాణాలను పరిశీలించారు. కొండకు భక్తులు వెళ్లడానికి దారి, ఆలయ నిర్మాణం, కొండ దిగువన ఆలయాభివృద్ధి సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. ఈ నేపథ్యంలో బోడికొండలో వెంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, ఆయన తండ్రి చెన్నకేశవులనాయుడు రూ.51 లక్షల విరాళం ప్రకటించారు. తామూ సహకరిస్తామని డీకే ఆదికేశవులు కుటుంబం ముందుకు వచ్చింది. మాజీ మేయర్, దివంగత కటారి అనురాధ మోహన్ కుటుంబం, మరికొందరు పారిశ్రామికవేత్తలు ఆలయ నిర్మాణానికి సహకరిస్తామని చెబుతున్నారు. వీరందరి సహకారంతో బోడికొండ అభివృద్ధి చెందిదే మరో చిన్న తిరుపతిగా మారుతుందని నగరవాసులు ఆశిస్తున్నారు.



వృద్ధురాలికి పింఛను అందిస్తున్న పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

# పింఛన్ల పండగ

**తొలిరోజు 96.41 శాతం పంపిణీ**

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 31: ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపణీ తొలి రోజైన శనివారం 96.41 శాతం పూర్తయింది. సెప్టెంబరు ఒకటి ఆదివారం కావడంతో ఒక్క రోజు ముందే పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉదయం 6 గంటల నుంచే గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. జిల్లావ్యాప్తంగా 2,69,740 మందికి గాను తొలి రోజు 2,60,049 మందికి అందజేశారు. వివిధ కారణాలతో 9,691 మందికి అందించలేకపోయారు. వీరికి సెప్టెంబరు 2వ తేదీన పంపిణీ చేయనున్నారు. 93.85 శాతం పూర్తి చేసి, నగరి మొదటి స్థానంలో నిలవగా, 93.47 శాతంతో యాదమరి, 93.18 శాతంతో విజయపురం రెండు మూడు స్థానాల్లో నిలిచాయి. 77.26 శాతంతో రామకుప్పం చివరి స్థానంలో ఉంది. కాగా, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల 18 డివిజన్‌లోని గాంధీవీధి, 47వ డివిజన్‌లోని లెనిన్ నగర్, 7వ డివిజన్ లోని కరుమారియమ్మ గుడి వీధుల్లో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పెద్దపంజాణి మండలం ముద్దేపల్లె, వద్దూరు, సూలేరుగుట్ట గ్రామాలలో పింఛన్లు పంపిణీ చేశారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ యాదమరి మండలం దాసరాపల్లె పంపిణీ చేశారు.


## టమోటా ధర పతనం

● 15కిలోల బాక్సు రూ.100

సోమల, ఆగస్టు 31: టమోటా ధర రోజురోజుకూ పతనావస్థకు చేరుకుంటోంది. సోమల మార్కెట్లో శనివారం 15కిలోల బాక్సు కేవలం రూ.100 పలికింది. కొంచెం మెరుగ్గా ఉన్నవి రూ.150 పలికాయి. నాణ్యత లేని రెండో రకం రూ.50 నుంచి వందలోపు ధర పలికాయి. జూన్‌లో నాటిన పంట నుంచి ఇప్పుడిప్పుడే దిగుబడులు వస్తున్నాయి. మార్కెట్లకు పంట తక్కువగా వస్తున్నా వర్షాల కారణంగా కాయల్లో నాణ్యత లేకపోవడంతో ధర పలకడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. అదే సమయంలో అనంతపురం, అన్నమయ్య జిల్లాల టమోటాలు నాణ్యంగా ఉండడంతో వ్యాపారులు వాటి కొనుగోలుకు ఉత్సాహం చూపుతున్నారు. ఇదిలావుండగా టమోటా మొక్కలకు చీడపీడలు వ్యాపించడంతో పురుగు మందులకు అధిక వ్యయం చేయాల్సి వస్తోందని, ప్రస్తుతం ఉన్న ధరకు ఖర్చులు కూడా రావడం లేదని మండల రైతులు వాపోతున్నారు.

## ప్రభుత్వ కళాశాలకు దరఖాస్తు చేసుకుంటే ప్రైవేటుకు కేటాయించారు

పలమనేరు, ఆగస్టు31 : ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ చేరేందుకు దరఖాస్తు(వెబ్ ఆప్షన్ ద్వారా) చేసుకుంటే ప్రైవేటు కళాశాలకు కేటాయిస్తూ సమాచారం రావడంతో విద్యార్థులు గొల్లుమంటున్నారు. పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరేందుకు బైరెడ్డిపల్లికి చెందిన వీణ, బైరెడ్డిపల్లి మండలం జంబుగుండ్లపల్లి గ్రామానికి చెందిన అనిల్‌కుమార్, గంగవరం మండలం సరమట్లపల్లెకు చెందిన దేవి దరఖాస్తు చేసుకున్నారు. వీరికి పలమనేరులోని ఒక ప్రైవేటు డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు కేటాయించినట్లు సమాచారం రావడంతో విస్తుపోయారు. ఈ విషయమై ఆర్జేడీ డాక్టర్ బాబును వివరణ కోరగా తన దృష్టికి వచ్చిందని, విచారణ జరుపుతున్నామని తెలిపారు.



# వైభవంగా రాజనాలబండ తిరునాళ్ల


● కిక్కిరిసిన లక్ష్మీనరసింహస్వామి కొండ

ప్రత్యేకాలంకరణలో ఆంజనేయ స్వామి

చౌడేపల్లె, ఆగస్టు 31: సత్య ప్రమాణాలకు నిలయమైన రాజనాలబండ తిరునాళ్ల శనివారం ప్రారంభమయ్యాయి. టీటీడీ ఆధ్వర్యంలో మొదటిసారిగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచేగాక తమిళనాడు, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో రాజనాలబండ, నరసింహస్వామి కొండ కిక్కిరిశాయి. రాజనాలబండ సమీపంలోని నరసింహస్వామి కొండపై స్వయంభుగా వెలసిన లక్ష్మీనరసింహస్వామికి, రాజనాలబండపై క్షేత్రపాలకుడిగా వెలసిన వీరాంజనేయస్వామికి ఆలయ నిర్వాహకులు అభిషేకాలు, అర్చనలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉపవాసదీక్షల్లో ఉన్న భక్తులు ప్రత్యేక పూజలు చేసి, దీక్షను విరమించారు. ఆలయ నిర్వాహకులు సాయంత్రం రాత్రి ధ్వజస్తంభంపై నేతితో అఖండ దీపం వెలిగించారు. రాత్రి అంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి ఉత్సవమూర్తులను పెద్దూరు, దాసరయ్యగారిపల్లె, ఊటూరు దేవరెద్దులతో కలిసి పెద్దూరు, గాజులవారిపల్లె, మల్లెలవారిపల్లె, వెంగళపల్లె, ఊటూరు, కొండామర్రి, కొత్త గూబలవారిపల్లె, పాతగూబలవారిపల్లె గ్రామాలలో ఊరేగించారు. మొక్కులు ఉన్న భక్తులు తలనీలాలు సమర్పించి, సహజసిద్ధంగా ఏర్పడిన కోనేరులో స్నానమాచరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రాజనాలబండ యూత్, ఎస్ఎల్ఎన్ యూత్ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. ఆదివారం ఉట్లోత్సవం, పాకుమాను పాకడం కార్యక్రమాలు ఉంటాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. టీడీడీ ఏఈవో మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు.



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



లక్ష్మీనరసింహస్వామి



## కాణిపాక ఆలయ ఈవో బాధ్యతల స్వీకరణ

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 31: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఈవోగా గురుప్రసాద్ శనివారం రాత్రి ఎమ్మెల్యే మురళీ మోహన్ సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. కర్నూలులో దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఈ ఆలయంలో పనిచేశానని, మరింత అభివృద్ధి చేసేందుకు 14 గ్రామాల ఉభయదారులు, టీడీపీ నాయకులు, గ్రామస్తులు సహకరించాలని కోరారు. సెప్టెంబరు 7 నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. బాధ్యతల స్వీకరణకు ముందు ఆయన స్వామిని దర్శించుకున్నారు. ఏఈవోలు ఎస్వీకృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, హరి మాధవరెడ్డి, ధనంజయ, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు పాల్గొన్నారు.



గురుప్రసాద్



హరి మృతదేహం వద్ద రోదిస్తున్న భార్యాబిడ్డలు

# అప్పుల బాధతో వ్యాపారి ఆత్మహత్య

చిత్తూరు, ఆగస్టు 31: అప్పుల బాధ తాళలేక వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న ఘటన చిత్తూరులో శనివారం చోటు చేసుకుంది. రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య వివరాల మేరకు.. మార్కెట్ చౌక్‌లో నివాసముంటున్న హరినాథగుప్తా అలియాస్ సిగరెట్ హరి సిగరెట్, ఇతర సరుకులకు హోల్ సేల్ డీలర్‌గా ఉన్నారు. ఉదయం 6.30 గంటలకు మార్కెట్ చౌక్ వద్ద టీ తాగి ద్విచక్ర వాహనంలో తేనబండ ధర్మరాజులగుడి కారు పార్కింగ్ వద్దకెళ్లాడు. అక్కడి నుంచి తన కారు డ్రైవర్‌కు ఫోన్ చేసి, ఆర్థిక ఇబ్బందులున్నాయని, ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పాడు. అనంతరం అక్కడున్న సీసీ కెమెరా ఎదురుగా నిల్చొని ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో పూర్తిగా కాలి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య, ఎస్ఐ ప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆర్థిక లావాదేవీల కారణంగానే ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించుకుని, కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ పెద్ద మరణంతో వారు కన్నీటిపర్యంతమయ్యారు.

## 14న జాతీయ లోక్ అదాలత్



చిత్తూరు లీగల్, ఆగస్టు 31: కక్షిదారులకు సత్వర న్యాయం చేసేలా ఈనెల 14వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు తెలిపారు. శనివారం ఆయన తన ఛాంబర్‌లో మీడియాతో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్ని కోర్టుల్లో లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. క్రిమినల్, సివిల్, చెక్ బౌన్సు, డీవీసీఎంసీ, బ్యాంకు సంబంధిత కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. 11,364 కేసులను గుర్తించామని, విజయవంతం చేసేందుకు న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసులు సహకరించాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో డీఎల్ఎస్ఏ సెక్రటరీ వెన్నెల పాల్గొన్నారు.

# విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా వుండాలి

తిరుపతి(ఆటోనగర్)ఆగస్టు31:వర్షాల నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా వుండాలని సదరన్ డిస్కం సీఎండీ కె.సంతోషరావు ఒక ప్రకటనలో కోరారు. సదరన్ డిస్కం పరిధిలో విద్యుత్ సరఫరా పర్యవేక్షణకోసం ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించామని తెలిపారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన ప్రాంతాల్లో నోడల్ అధికారులు యుద్ధప్రాతిపదికన సరఫరా పునరుద్ధరణ పనులు చేపడతారని తెలిపారు. అనంతపురం సర్కిల్‌కు సీజీఎం వరకుమార్,నెల్లూరు సర్కిల్‌కు సీజీఎం ఆదిశేషయ్య, తిరుపతి సర్కిల్‌కు జనరల్ మేనేజరు సి.హెచ్.రామచంద్రరావు, కడప సర్కిల్‌కు జీఎం పి.మురళి, కర్నూలు సర్కిల్‌కు ఎస్.కె.ఇస్మాయిల్‌అహ్మద్ నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారన్నారు. వర్షాలు కురుస్తున్న సమయంలో ప్రజలు విద్యుత్ స్తంభాలను తాకరాదని, తడి చేతులతో స్విచ్‌లు వేయరాదని, విద్యుత్ లైన్ల కింద నిలుచోరాదని సూచించారు. విద్యుత్ తీగలు తెగడం,స్తంభాలు కూలిపోయిన సమయంలో వెంటనే తమ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు. టోల్‌ఫ్రీ నెంబర్లు 1912 లేదా 18004251555333కు కాల్ చేసి సమాచారం తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.అలాగే 9133331912 నెంబరుకు విద్యుత్ సరఫరా అంతరాయాల సమాచారాన్ని చాటింగ్ చేయాలని కోరారు.



ఎస్పీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు

## చిత్తూరు కమిషనర్‌గా నరసింహప్రసాద్

● అరుణ మాతృశాఖకు బదిలీ



చిత్తూరు, ఆగస్టు 31: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నరసింహప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ కమిషనర్‌గా డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న అరుణ తన మాతృ శాఖ పంచాయతీరాజ్‌కు బదిలీ అయ్యారు. ఆమె 2022 ఏప్రిల్ నుంచి చిత్తూరు కమిషనర్‌గా పనిచేస్తున్నారు. నగరంలోని సర్కిళ్లు, పార్కుల అభివృద్ధితో పాటు డివైడర్ల ఏర్పాటు, నగర సుందరీకరణలో తన ముద్ర వేశారు. ఎన్నికల సమయంలో ఏకపక్షంగా పనిచేస్తున్నారంటూ ఈమెపై టీడీపీ నాయకులు అప్పటి జేసీ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. ఇక కొత్త కమిషనర్ నరసింహప్రసాద్ 2018 గ్రూప్-1 బ్యాచ్ అధికారి. ప్రస్తుతం గ్రేడ్-1 మున్సిపల్ కమిషనర్ ర్యాంకులో ఉన్న ఈయన గతంలో పుంగనూరు, తాడిపత్రి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసి తనదైన ముద్ర వేశారు.

## చుడా వీసీ విశ్వనాథ్ బదిలీ



చిత్తూరు, ఆగస్టు 31: చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ (చుడా) వైస్ చైర్మన్ విశ్వనాథ్ బదిలీ అయ్యారు. అనంతపురం మున్సిపల్ రీజనల్ డైరెక్టర్‌గా వెళ్లారు. గతంలో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేసిన ఈయన్ను రెండేళ్ల కిందట ప్రభుత్వం చుడా వైస్ చైర్మన్‌గా బదిలీ చేసింది. తాజాగా ఆయన్ను అనంతపురానికి బదిలీ చేయడంతో పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## ముఖ్యమైన కూడళ్లలో సీసీ కెమెరాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు, ఆగస్టు 31: గ్రామాల్లో, పట్టణాల్లోని ముఖ్యమైన కూడళ్లలో, అపార్టుమెంటు వంటి ప్రదేశాలలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్పీ మణికంఠ ఆదేశించారు. జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్ కాన్ఫరెన్స్ హాలులో ఎస్‌ఐలు, సీఐలు, డీఎస్పీలతో శనివారం ఆయన నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసులు, గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులు, పాత నేరస్థుల గురించి ఆరా తీశారు. రోడ్డు ప్రమాదాలు మరింత తగ్గించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. మహిళలకు, విద్యార్థినులకు సమాజంలో జరిగే నేరాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలిగి ఫిర్యాదులు స్వీకరించాలని ఆదేశించారు. అనంతరం నేర ఛేదనలో, ప్రాపర్టీ రికవరీలో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి నగదు రివార్డులు అందించారు.

## పంట పొలాలపై ఏనుగుల దాడి



నేలపాలైన టమోటా పంట

సదుం, ఆగస్టు 31: మండల పరిధిలోని జోగివారిపల్లె అటవీ శివారు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి ఏనుగుల గుంపు సంచరిస్తూ పంటలను నాశనం చేశాయి. రైతులు ప్రకాష్ రెడ్డి, మదన, పురుషోత్తంరెడ్డిలకు చెందిన టమోటా, అనప, మినుము పంటలను తొక్కి ధ్వంసం చేశాయి. చుట్టూ అటవీ ప్రాంతం కావడంతో మండలంలో తరచూ ఏనుగులు సంచరిస్తూ పంటలను నష్టపరుస్తున్నాయి. ఇనుప కంచెలు, కూసాలు ఏర్పాటు చేసినా లెక్క చేయడం లేదు. ఇప్పటికే ఏనుగుల దాడిలో ఇద్దరు రైతులు మృత్యువాతపడ్డారు. అదే సమయంలో విద్యుత్ షాక్‌తో రెండు ఏనుగులు చనిపోయాయి.పొలాలకు వెళ్లాలంటే భయమేస్తోందని, అటవీ శాఖాధికారులు స్పందించి ఏనుగులు రాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## ఎట్టకేలకు కరుణించిన వరుణుడు

● 15 రోజుల తర్వాత కురిసిన వాన

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 31: జిల్లావ్యాప్తంగా నైరుతి రుతుపవనాల ప్రభావంతో 15 రోజుల విరామం తర్వాత వానలు మొదలయ్యాయి. గడచిన 24 గంటల్లో రామకుప్పం, శాంతిపురం మినహా మిగిలిన 30 మండలాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా విజయపురంలో 21.8, అత్యల్పంగా బైరెడ్డిపల్లిలో 2.2 మిమీ వర్షపాతం నమోదయ్యింది. మండలాలవారీగా చిత్తూరులో 18.2, పూతలపట్టులో 16.6, సదుంలో 16.4, పులిచెర్లలో 15.0, సోమలలో 14.8, నగరిలో 14.2, నింద్రలో 13.6, శ్రీరంగరాజపురంలో 13.6, తవణంపల్లెలో 12.2, గంగాధరనెల్లూరులో 12.0, కుప్పంలో 10.6, పెద్దపంజాణిలో 9.2, పలమనేరులో 9.2, గంగవరంలో 8.8, ఐరాలలో 8.2, పెనుమూరులో 8.0, చౌడేపల్లిలో 7.8, యాదమరిలో 7.4, బంగారుపాళ్యంలో 7.2, రొంపిచెర్లలో 6.6, పాలసముద్రంలో 5.6, పుంగనూరులో 5.4 మిమీ వర్షం కురిసింది. జిల్లాలో ఆగస్టు సాధారణ వర్షపాతం 122.1 మిమీ. శనివారం వరకు సాధారణానికి మించి 13 శాతం అదనంగా అనగా నమోదయ్యింది. 23 మండలాల్లో 20 శాతం అదనంగా వర్షం కురవగా, మిగిలిన తొమ్మిది మండలాల్లో అంతకు లోపు వర్షం కురిసింది. జూలైలో 13.6 మిమీ లోటు వర్షపాతం నమోదయ్యింది. ఆగస్టులో గడిచిన 15 రోజుల్లో సరైన వర్షపాతం లేనందున 15 మండలాల్లో 612 హెక్టార్ల వేరుశనగ పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు కలెక్టరుకు నివేదిక అందజేశారు.

## నేటి నుంచి శ్రీవారి ఆలయంలో శుక్ల యజుర్వేద పారాయణం

తిరుమల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం టీటీడీ నిర్వహిస్తున్న చతుర్వేద పారాయణంలో భాగంగా సెప్టెంబరు 1వ తేదీ నుంచి తిరుమల శ్రీవారి ఆలయంలో నాలుగో విడత శుక్ల యజుర్వేద పారాయణం ప్రారంభంకానుంది. చతుర్వేద పారాయణంలో భాగంగా జూలై1న ప్రారంభమైన సామవేద పారాయణ శనివారంతో ముగిసింది. ఈక్రమంలో ఆదివారం నుంచి శుక్ల యజుర్వేద పారాయణాన్ని మొదలుపెట్టేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీవారి ఆలయంలోని రంగనాయక మండపంలో ప్రతిరోజు ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య వేదపండితులు శుక్ల యజుర్వేద పారాయణం చేయనున్నారు.

## చెట్టు కూలి చెన్నై భక్తురాలికి గాయాలు



గాయపడిన ఉమామహేశ్వరి

తిరుమల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఓ వృక్షం కూలి చెన్నైకి చెందిన ఉమామహేశ్వరి(44) అనే భక్తురాలు గాయపడింది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం రాత్రి వరకు వర్షపు చినుకులు పడుతున్న క్రమంలో ఏఎంసీ ప్రాంతంలోని 305వ కాటేజి వద్ద ఓ భారీ వృక్షం కూలిపోయింది. సమీపంలో కూర్చుని ఉన్న ఉమామహేశ్వరిపై చెట్టు కొమ్మలు పడటంతో తల, శరీరభాగాలపై గాయాలయ్యాయి. వెంటనే తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తరలించి వైద్యం చేశారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు ఘటనా ప్రాంతానికి చేరుకుని కూలిన వృక్షాన్ని తొలగించారు. చెట్ల కింద ఎవరూ కూర్చోవద్దని మైకుల ద్వారా సూచించారు.

## బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న



చంద్రగిరి, ఆగస్టు 31: శ్రీనివాసమంగాపురంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 10.30 గంటలకు స్వామి అమ్మవార్లకు కల్యాణోత్సవం, సాయంత్రం ఊంజల్ సేవను కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## ముక్కంటి ఆలయాన్ని దర్శించుకున్న కబడ్డీ జట్టు



శ్రీకాళహస్తి, ఆగస్టు 31: ముక్కంటి ఆలయాన్ని బెంగళూరు ప్రొ కబడ్డీ జట్టు సభ్యులు శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు ఆశీర్వదించి తీర్థప్రసా దాలు అందజేశారు.

# తుడాలో ఇక ఐఏఎస్‌ల పాలన

### వైసీపీ ప్రభుత్వంలో నాన్ ఐఏఎస్‌లతో ఇష్టారాజ్యం - కూటమి ప్రభుత్వంలో మళ్లీ పాత సంప్రదాయం

### మున్సిపల్ కమిషనర్‌కు అదనపు బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న మౌర్య

తిరుపతి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)లో ఇక ఐఏఎస్‌ల పాలన కొనసాగనుంది. 2019వరకు మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న ఐఏఎస్ అధికారినే తుడా వీసీగా అదనపు బాధ్యతలు అప్పగించేవారు. దీంతో పాలనలో పారదర్శకత ఉండేది. అభివృద్ధి పనుల్లో తుడా-మున్సిపల్ కార్పొరేషన్ మధ్య చక్కని సమన్వయం కనిపించేది. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక అప్పటికే ఉన్న ఐఏఎస్ అధికారి కొన్ని వివాదాస్పదమైన ఫైల్స్‌పై సంతకం చేసేందుకు నిరాకరించినట్టు వార్తలొచ్చాయి. దీంతో ఐఏఎస్ అధికారిని తప్పించి నాన్-ఐఏఎస్ అధికార్లను నియమిస్తూ వచ్చారు. ఈనేపథ్యంలో తుడా నిధుల గోల్‌మాల్‌పై అనేక ఆరోపణలు వచ్చాయి. ఇటీవల మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ తుడాలో నిర్వహించిన సమీక్షలో సిబ్బంది జీతాలకే ఏడాదికి రూ.15కోట్లు వెచ్చించడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. తుడా ప్రక్షాళనలో భాగంగా పాత సంప్రదాయాన్నే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తెరపైకి తీసుకొచ్చింది. మున్సిపల్ కమిషనర్ నారప రెడ్డి మౌర్యకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఆమేరకు శనివారం ఆమె తుడా వీసీగా బాధ్యతలు చేపట్టారు.

**తుడా అభివృద్ధికి కృషి చేస్తా : మౌర్య**

తుడా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని వైస్ చైర్మన్ మౌర్య అన్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడారు. నగరపాలక సంస్థ, తుడాల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. ఈమెకు ఇన్‌చార్జి వీసీగా పనిచేసిన వెంకట నారాయణ తోపాటు నగరపాలక సంస్థ, తుడా అధికారులు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

# డ్రగ్స్ ఫ్రీ తిరుపతి

### అవగాహన ర్యాలీలో గొంతెత్తిన విద్యార్థులు





ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ సుబ్బరాయుడు, ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 31: డ్రగ్స్ ఫ్రీ ఇండియా.. డ్రగ్స్ ఫ్రీ ఏపీ.. డ్రగ్స్ ఫ్రీ తిరుపతి.. డ్రగ్స్ ఫ్రీ యూనివర్సిటీ.. పేరుతో తిరుపతిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎస్వీయూ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం - తిరుపతి పోలీసు శాఖ సంయుక్తంగా మత్తు పదార్థాల వ్యతిరేకంగా శనివారం ఎస్వీయూ పరిపాలనా భవనం నుంచి ఈ ర్యాలీ చేపట్టాయి. ఎన్టీఆర్ సర్కిల్ దాకా సాగిన ఈ ర్యాలీలో అధిక సంఖ్యలో విద్యార్థులు, ఉద్యోగులు, పోలీసులు పాల్గొన్నారు. ర్యాలీని ఎస్పీ సుబ్బరాయుడు, ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. లేకుంటే తీవ్ర శిక్షలకు గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు. డ్రగ్స్‌పై 80999 99977 నెంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. డ్రగ్స్ అనుమానిత ప్రాంతాల్లో పోలీసు పెట్రోలింగ్, నిఘా పెట్టామన్నారు. జిల్లాలో డ్రగ్స్‌ను సమూలంగా నివారించేందుకు పోలీసు శాఖ అన్ని ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. అయినా, డ్రగ్స్ నివారణకు విద్యార్థులు, ప్రజల సహకారం అవసరమని అన్నారు. ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ.. మత్తు పదార్థాల మాయలో పడి యువత తమ విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కోరారు. భవిష్యత్తులోనూ పోలీసు శాఖతో కలిసి మరిన్ని కార్యక్రమాలు చేస్తామన్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ దామోదరం, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలలో 17న అనంతపద్మనాభ వ్రతం

తిరుమల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో సెప్టెంబరు 17న అనంతపద్మనాభ వ్రతం జరుగనుంది. ప్రతి ఏడాది భాద్రపద మాస శుక్ల చతుర్దశి పర్వదినాన అనంతపద్మనాభ వ్రతం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆరోజు ఉదయం 8.30 నుంచి 9.30 గంటల మధ్య శ్రీవారి సుదర్శన చక్రత్తాళ్వారును ఆలయం నుంచి ఊరేగింపుగా భూవరాహస్వామి ఆలయం వద్దనున్న పుష్కరిణి చెంతకు వేంచేపు చేస్తారు. అక్కడ శ్రీవారి సుదర్శన చక్రత్తాళ్వారుకు ప్రత్యేక అభిషేకాదులు నిర్వహించి తిరిగి ఆలయానికి వేంచేపు చేస్తారు. అలాగే సెప్టెంబరు 5వ తేదీన బలరామ, వరాహ జయంతి ఉత్సవాలు జరుగనున్నాయి. 18వ తేదీన పౌర్ణమి గరుడసేవ, 28న సర్వఏకాదశి పర్వదినాలు ఉన్నాయి.

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.80 కోట్లు

తిరుమల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.80 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి, శనివారం ఉదయం ప్రకటించింది. శుక్రవారం 65,080 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 27,394 మంది తలనీలాలు సమర్పించారు.

## నేటి నుంచి పుష్కరిణిలోకి భక్తుల అనుమతి

### తిరిగి ప్రారంభం కానున్న హారతి

తిరుమల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల నేపథ్యంలో నెల ముందుగా నిర్వహించే మరమ్మతు పనులు పూర్తయి నూతన హంగులతో తీర్చిదిద్దబడిన శ్రీవారి పుష్కరిణిలోకి ఆదివారం నుంచి భక్తులను అనుమతించనున్నారు. ఆగస్టు 1 నుంచి 31వ తేదీ వరకు పుష్కరిణిలో మరమ్మతు పనులు చేపట్టారు. పాత నీటిని తొలగించి అడుగు భాగంలో పేరుకుపోయిన ఇసుక, పాచిని తొలగించడానికి దాదాపు వందమంది వాటర్‌వర్క్స్ సిబ్బంది రేయింబవళ్లు కష్టపడి స్వామి పుష్కరిణి శుద్ధి కార్యక్రమాన్ని పూర్తిచేశారు. పుష్కరిణి మెట్లను బంగారు రంగుల అద్దకంతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. దాదాపు కోటి లీటర్ల నీటితో స్వామి పుష్కరిణిని నింపి మరమ్మతులు పూర్తి చేశారు. ఈక్రమంలో ఆదివారం నుంచి పుష్కరిణిలోకి భక్తులను అనుమతించడంతో పాటు నెలరోజుల పాటు నిలిచిపోయిన పుష్కరిణి హారతి కూడా తిరిగి ప్రారంభం కానుంది.

## జాషువా సాహిత్యంతో సామాజిక చైతన్యం





డాక్టర్ కస్తూరికి జ్ఞాపిక అందజేసున్న అధ్యాపకులు, విద్యార్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 31: గుర్రం జాషువా సృజించిన సాహిత్యం సామాజిక చైతన్యాన్ని కల్గిస్తూ ఉందని పద్మావతి డిగ్రీ-పీజీ కాలేజీ తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ కస్తూరి అభిప్రాయపడ్డారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో సాహితీ సమితి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాంఘిక దురాచారాలను తన సాహిత్యం ద్వారా ఖండించిన ప్రత్యేకత జాషువాదన్నారు. వర్సిటీ తెలుగు విభాగాధిపతి ఆచార్య కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ.. సాహిత్యం పట్ల విద్యార్థుల్లో అవగాహనకు నిరంతరం ప్రయత్నిస్తున్నామన్నారు. సమితి సలహాదారు డాక్టర్ డి.యువశ్రీ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సాహిత్యం పట్ల మరింత అభిరుచి కల్పించే లక్ష్యంతో అతిథి ఉపన్యాసాలు ఇప్పిస్తున్నామని తెలిపారు. అధ్యాపకులు డాక్టర్ వై.సుభాషిణి, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## టూరిజం నకిలీ దర్శన టికెట్ల కేసులో మరో ఇద్దరి అరెస్ట్



సీఐ అదుపులో నారాయణ, అరసు

తిరుమల, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): టూరిజం నకిలీ దర్శన టికెట్ల కేసు వ్యవహారంలో తిరుమల పోలీసులు మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఏపీ టూరిజం పేరిట ఉన్న నకిలీ దర్శన టికెట్లతో ఓ ముఠా సాగించిన అక్రమాలు ఆగస్టు20వ తేదీన వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. చెన్నైకి చెందిన ఎంపైర్ ట్రావెల్స్ సంస్థ నిర్వాహకులతో కుమ్మక్కై నకిలీ టికెట్లను స్కాన్ చేస్తున్నట్టు నటించి భక్తులను అనుమతిస్తున్న అక్రమం కలకలం సృష్టించింది. ఈ కేసులో కాంట్రాక్ట్ ఉద్యోగి రుద్రసాగర్‌తో పాటు కేవీఎస్ సంస్థలో పనిచేసిన మాజీ ఉద్యోగి నవీన్, ట్రావెల్స్‌కు చెందిన పెరియస్వామిని విజిలెన్స్ ఫిర్యాదుతో పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ఈ కేసులో ఎవరెవరున్నారు, వీరికి టీటీడీ ఉద్యోగులు ఏమైనా సహకరించారా అనే అంశాలపై టూటౌన్ సీఐ సత్యనారాయణ విచారణ జరిపారు.కేవీఎం సంస్థలో గతంలో పనిచేసిన నారాయణ పాత ఏపీ టూరిజం టికెట్లను ఎంపైర్ ట్రావెల్స్ ఉద్యోగి అరసుకు పంపగా రూ.15 వేలకు మోహన్‌రాజు అనే వ్యక్తికి విక్రయించి తిరుమలకు పంపినట్టు పోలీసుల విచారణలో తేలింది. దీంతో నారాయణతో పాటు అరసును అరెస్ట్ చేసి వారి సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. వారి బ్యాంకు ఖాతాలను పరిశీలించడంతో పాటు వారికి ఎవరెవరితో సంబంధాలున్నాయనే అంశాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## శనీశ్వరస్వామికి తైలాభిషేకం



ప్రత్యేక అలంకారంలో శనీశ్వరస్వామి

శ్రీకాళహస్తి, ఆగస్టు 31: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల అభి షేకం అనంతరం శనీశ్వర స్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి పూజ, కలశపూజ చేశారు. స్వామివారికి నువ్వుల నూనె, మంచి నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. స్వామివారిని పలు పుష్పాలతో అలంకరించి పూజలు చేసి ధూప, దీప నైవేద్యాలు సమ ర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

## వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సెంధిల్‌కుమార్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీడీపీ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పీసీసీఎఫ్ ఆర్కే సుమన్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

## వర్షాల హెచ్చరికలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తం

● ఆర్డీవోలతో జేసీ, డీఆర్వో వీడియో కాన్ఫరెన్స్

● ఆర్డీఓ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

తిరుపతి(విద్య), ఆగస్టు 31:పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండడం, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో తిరుపతి జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. విపత్తు నిర్వహణ సంస్థ జిల్లాకు ఎల్లో అలర్ట్ జారీ చేసి అప్రమత్తంగా ఉండాలని సూచించింది.దీంతో తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, గూడూరు ఆర్డీవో కార్యాలయాలతో పాటు మండల కేంద్రాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటయ్యాయి. కంట్రోల్‌రూముల్లో 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. శనివారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో పెంచల కిషోర్ ఆర్డీవోలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఎక్కడెక్కడ భారీ వర్షాలు కురిశాయని అధికారులను ఆరా తీశారు. ఐతే సముద్రతీర ప్రాంతాల్లోకూడా వర్షా లు కురవలేదని ఆర్డీవోలు తెలియజేశారు.అయినప్పటికీ జాగ్రత్తగా ఉండాల ని, ఎటువంటి పరిస్థితులు ఎదురైనా తక్షణం స్పందించేలా సిద్ధంగా ఉండాల ని జేసీ ఆదేశించారు.తహసీల్దార్లు కూడా అప్రమత్తంగా ఉంటూ, జిల్లా కేంద్రానికి సమాచారం తెలియజేస్తూ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్ నంబర్లకు కాల్‌చేసి సమాచారాన్ని తెలియజేయాలని కోరారు.

**కంట్రోల్‌రూమ్ నంబర్లు**

తిరుపతి కలెక్టరేట్ 0877-2236007.
తిరుపతి ఆర్డీఓ కార్యాలయం : 8686966559
శ్రీకాళహస్తి : 9959322935
సూళ్లూరుపేట:8897265235
గూడూరు : 08624-252807

## తిరుమలలో చిరుజల్లులు



తిరుమల మాడవీధుల్లో చిరుజల్లులు

తిరుమల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం తిరుమల క్షేత్రంలోనూ కనిపించింది. శుక్రవారం సాయంత్రం నుంచే నల్లటి మేఘాలు తిరుమలను కప్పేశాయి.శుక్రవారం రాత్రి నుంచి శనివారం రాత్రి వరకు చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. చిన్నపాటి చినుకులే కావడంతో భక్తులు కూడా వర్షంలో తడుస్తూనే దర్శనానికి వెళ్లడం, తిరిగి బయటకు రావడం కనిపిచింది. కాలినడక భక్తులు కూడా వర్షంలో తడుస్తూనే రాకపోకలు సాగించారు.తిరుమలలో చలి విపరీతంగా పెరిగింది. శ్రీవారి దర్శనార్థం వచ్చిన చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడుతూ కనిపించారు. ఘాట్‌రోడ్లలో ప్రయాణించే ద్విచక్రవాహనదారులు జల్లులతో ఇబ్బందిపడ్డారు.

# పలమనేరు
## కుప్పం/పుంగనూరు



## కుప్పం నర్సింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే


గ్రాడ్యుయేషన్ పట్టాల ప్రదానం

కుప్పం, ఆగస్టు 31: బీసీఎన్ విద్యా సంస్థల యాజమాన్యంలోని కుప్పం డిగ్రీ కళా శాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బెంగళూరు ఆర్ఆర్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ డీన్ డాక్టర్ కె.రాము విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు నర్సింగ్ సిబ్బంది అందించే సేవలు ఎంతో అమూల్యమైనవన్నారు. వైద్యులు చేసే వైద్యంకంటే నర్సింగ్ సిబ్బంది, రోగులతో ఆప్యాయంగా, ఓపికగా మెలిగే తీరే వ్యాధి బారినుంచి వారిని త్వరగా కోలుకునేలా చేస్తుందని చెప్పారు. వృత్తిపట్ల అంకితభావం కలిగి, సున్నిత మనస్తత్వంతో ప్రేమానురాగాలతో మెలగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్, చైర్‌పర్సన్ శాంతారాజ్, సీఈవో సాగర్‌రాజ్, ప్రిన్సిపాల్ ఎస్‌జే.విమల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు


పూజల్లో కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం, ఆగస్టు 31: కుప్పంలోని జమీందారు బంగళా సమీపంలో ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ భగవానుని ప్రతిమకు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీకృష్ణ భగవానుని ప్రతిమను పట్టణంలో అత్యంత భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. ఈ ఊరేగింపుతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ముగిశాయి. కడా పీడీ వికాస్ మర్మత్ భగవానుడిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి శ్రీకృష్ణుని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి కుప్పం కమిటీ అధ్యక్షుడు కృష్ణ, సభ్యులు ప్రకాశ్, కుమార్, కృష్ణన్న, కృష్ణారెడ్డి, శివకృష్ణ, ఇందిర, రాధ, లీలమ్మ, సంగీత, వెంకటమ్మ, మరియమ్మ, వెంకటలక్ష్మి, గాయత్రి, యశశ్విని, మైత్రి తదితరులు పాల్గొన్నారు.

## పలమనేరులో 96 శాతం పింఛన్ల పంపిణీ


పెన్షన్లు పంపిణీ చేస్తున్న కమిషనర్ రమణారెడ్డి

పలమనేరు, ఆగస్టు31 : పలమనేరు మున్సిపాలిటీలో శనివారం పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఉదయం 5 గంటల నుంచే ప్రారంభించారు. మొత్తం 4650 మందికి పెన్షన్లు పంపిణీ చేయాల్సి ఉండగా శనివారం సాయంత్రం 5 గంటలకు 4446 మందికి (96శాతం) మందికి పెన్షన్లు పంపిణీ చేశారు. మున్సి పాలి టీలో సచివాలయ సిబ్బందితో కలిసి మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్ పింఛన్లు పంపిణీ చేశారు. ● పలమనేరు మండలంలోని 10 పంచాయితీల్లో మొత్తం 4550 మందికి గాను 4364 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ రాజేష్ తెలిపారు.

## స్ఫటిక లింగానికి రుద్రాభిషేకం

పలమనేరు, ఆగస్టు31: స్థానిక విష్ణుపురి ఆలయంలో వెలసిన నిర్వాణ నారాయణ స్వామి ఆలయంలో కొత్తగా ఏర్పాటుచేసిన స్ఫటిక శివలింగానికి శనివారం పంచామృత రుద్రాభిషేక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ధర్మకర్త భోగనాథం సురేష్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

రామకుప్పం, ఆగస్టు 31: చివరి శ్రావణ శనివారం, శని త్రయోదశి కలిసి రావడంతో రామకుప్పం పట్టణ శివార్లలోని ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిశాయి. వళ్లీదేవ సేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆవరణలోని వేంకటేశ్వరాలయంలో శ్రావణ శనివార పూజలు, శనీశ్వరాలయంలో శనిత్రయోదశి పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం దేవతామూర్తులకు ప్రత్యేక అభిషేకపూజలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. కుప్పం, పలమనేరు నియోజకవర్గాల నుంచే కాకుండా కర్ణాటక సరిహద్దు గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. సుబ్రహ్మణ్యస్వామి ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు.

## రామకుప్పంలో 95శాతం పింఛన్ల పంపిణీ

రామకుప్పం, ఆగస్టు 31: మండలంలో శనివారం 95శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో ఈశ్వరన్న తెలిపారు. సచివాలయ సిబ్బందితో కలిసి టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్ పింఛన్లు అందజేశారు.

## పౌరహక్కులపై గ్రామాల్లో అవగాహన

వి.కోట, ఆగస్టు 31: గ్రామీణ ప్రాంతాలో ప్రజలకు పౌరహక్కులపై అధికారులు అవగాహన కల్పించారు. తహసీల్దార్ పార్వతి నేతృత్వంలో అధికారులు కుంభార్లపల్లె పంచాయతీ బాలేంద్రపల్లెలో పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రాథమిక హక్కులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందజేస్తున్న వివిధ రకాల పథకాలపై ఎంపీడీవో మహ్మద్‌రఫీ వివరించారు. చట్టం, న్యాయ సంబంధిత అంశాలపై ఎస్ఐ బాబు ప్రజలకు అర్థయ్యేలా పలు అంశాలను వివరించారు. మండల స్థాయి అధికారులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## శనిత్రయోదశికి ప్రత్యేక పూజలు

వి.కోట, ఆగస్టు 31: శనిత్రయోదశిని పురస్కరించుకుని వి.కోట సమీపంలో పాపేపల్లె వద్ద వెలసిన శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. త్రయోదశిని పురస్కరించుకుని పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. జడ్పీ చైర్మెన్ శ్రీనివాసులు దంపతులు స్వామివారి సేవలో పాల్గొన్నారు.

## సంప్రదాయబద్ధంగా వినాయక ఉత్సవాలు

వి.కోట, ఆగస్టు 31: హైందవ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపటేలా వినాయక చవితి నిర్వహించేందుకు హిందువులందరూ సహకరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మైందల రామచంద్రుడు అన్నారు. శనివారం పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో వి.కోట వినాయక ఉత్సవ కమిటీ ప్రత్యేకంగా సమావేశ మయ్యారు. మండపాలు ఏర్పాటు చేసుకునే వారు ఆన్‌లైన్ ద్వారా ఎలా అనుమతులు పొందాలో వివరించారు. ఆలయాల ధర్మకర్తలు, కమిటీ సభ్యులు, ఆర్ఎస్ఎస్, బీజేపీ నేతలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

చౌడేపల్లె, ఆగస్టు31: బీజేపీ రాయలసీమ కిసాన్ మోర్చ జోన్ ఇన్‌చార్జి కిరణ్ శనివారం ఆ పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీజేపీ మండలాధ్యక్షులు మనోహర్, కిసాన్ మోర్చ జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీలకు సమాన హక్కులు

చౌడేపల్లె, ఆగస్టు31:సమాజంలో ఎస్సీ, ఎస్టీలకు సమాన హక్కులు ఉంటాయని తహసీల్దార్ హనుమంతు పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక నాయునివారి పాళ్యంలో పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా ఎస్సీ, ఎస్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో వారికి ఉన్న హక్కులపై అవగాహన కల్పించారు. ఆర్ఐ సుధాకర్‌నాయక్ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి సహకరించండి

చౌడేపల్లె, ఆగస్టు31: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డిని ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు. శనివారం మండలంలోని తెల్లనీళ్లపల్లెలోని ఆయన నివా సంలో ఆయన్ను కలిసి ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో భాగంగా ఎదుర వుతున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించినట్లు టీచర్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గిరిరాజు, లింగమూర్తి, ఏవి సుబ్రహ్మణ్యం, ఆచారి, సుధాకర్‌నాయుడు, ప్రకాష్, పురుషోత్తం పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలకు ఆర్వోప్లాంట్, గ్రైండర్ల వితరణ



రామకుప్పం, ఆగస్టు 31: స్థానిక ప్రభుత్వ గిరిజన గురుకుల పాఠశాలకు కుప్పం ఇంజినీరింగ్ కళాశాల వైస్‌చైర్మెన్ సునీల్‌రాజ్ రూ.50వేలు విలువైన ఆర్వోప్లాంట్, గ్రైండర్లను వితరణగా ఇచ్చారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతితో కలిసి ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం వెట్‌గ్రైండర్‌ను ప్రధానోపాధ్యాయుడు రమేష్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కుప్పం వారియర్స్ కార్యదర్శి సెంథిల్‌కుమార్, కోశాధికారి చరణ్, సభ్యులు డా.కృష్ణమూర్తి, చంద్రబాబునాయక్ పాల్గొన్నారు.

## నేడు చంద్రబాబు పేరిట పూజలు

కుప్పం, ఆగస్టు 31: చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణ స్వీకారంచేసి 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని కుప్పంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు పూజలు చేయడంతో పాటు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకుంటామన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు ఈ పూజల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

## 5న వ్యవసాయ పాలిటెక్నిక్ ప్రవేశాలకు ఇంటర్వ్యూలు

పుంగనూరు రూరల్, ఆగస్టు 31: పుంగనూరు వ్యవసాయ పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 5న గుంటూరు జిల్లా కృష్ణా ఆడిటోరియంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ మంజుల ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేయకపోయినా కౌన్సిలింగ్‌లో పాల్గొడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయింపు ఉంటుందని వివరించారు. వివరాలకు సెల్ నెంబర్లు 9010402068, 9493253151, 9491459956లను సంప్రదించాలని కోరారు.

## కమనీయం శ్రీనివాస కల్యాణం



పుంగనూరు, ఆగస్టు 31: శ్రీనివాస కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసం చివరి శనివారం కావడంతో బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్ మండలంలోని భీమగానిపల్లె క్రాస్ వద్ద శ్రీనివాస కల్యాణోత్సవాన్ని ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 3గంటల నుంచి వివిధ రకాల కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు, చెక్కభజనలు, కోలాటాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి 8గంటల వరకు స్వామివారికి వేదపండితుల మధ్య ప్రత్యేక పూజలు, అలంకరణలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు. పుంగనూరు, మదనపల్లె, చౌడేపల్లె మండలాల నుంచి భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## కమిషనర్ సేవలు మరువలేనివి



పుంగనూరు, ఆగస్టు31: మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్‌రెడ్డి సేవలు మరువలేనివని మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి చిత్తూరు కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. దీంతో శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది, కార్మికులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పట్టణాభివృద్ధి చేయడంతో పాటు సిబ్బంది, ప్రజ సమస్యలను పరిష్కరించడానికి చొరవ చూపిన అధికారిగా పేరుప్రతిష్టలు తెచ్చుకున్నట్లు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ మహేశ్, ఏఈ కృష్ణకుమార్, సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు

పుంగనూరు. ఆగస్టు31: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేసినట్లు మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఉదయాన్నే ఇళ్ల వద్దకు చేరకుని పింఛన్లు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే పట్టణ పరిధిలో పలుచోట్ల టీడీపీ నాయకులు శ్రీకాంత్, సీవీ రెడ్డి, పోలీస్‌గిరి, సుబ్రణ్యంరాజు, ప్రకాశ్, విజయమ్మ, రామయ్య, చంద్ర, సద్దామ్‌హుస్సేన్‌లు పింఛన్లు పంపిణీ చేశారు. మండల పరిధిలో పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి గ్రామ పంచాయతీ కేంద్రాలల్లో పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు

## పాతకక్షలతో దాడి


చికిత్స పొందుతున్న సురేంద్ర

పుంగనూరు రూరల్, ఆగస్టు31: పాత కక్షలతో తనపై దాడి చేసి గాయపరచారంటూ ఓ బాధితుడు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మండలంలోని ఈడిగపల్లెకు చెందిన రాజన్న కుమారుడు సురేంద్ర(32)కు అదే గ్రామానికి చెందిన సదాశివ, నారాయణస్వామికి పాత గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో ఇంటి వద్ద ఉన్న సురేంద్రను సదాశివ, నారాయణ స్వామి, ఆదిలక్ష్మిలు కలిసి దాడిచేసి గాయపరిచారు. బాధితుడు పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

## రోడ్డు ప్రమాదంలో బాలుడికి తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, ఆగస్టు31: పుంగనూరు- పలమనేరు మార్గంలో ద్విచక్రవాహనం బోల్తాపడి ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన శనివారం పుంగనూరు సమీపంలో జరిగింది. జగనన్న కాలనీకి చెందిన సయ్యద్ బాషా కుమారుడు మహ్మమద్‌హుసేన్(14) పట్టణంలో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం ద్విచక్రవాహనంలో తన తమ్ముడిని పాఠశాలలో వదలడానికి ద్విచక్రవాహనంలో వెళుతూ అదుపు తప్పి ఆగి ఉన్న లారీ కింద పడ్డాడు. మహ్మమద్ హుసేన్ తీవ్ర గాయాలపాలయ్యాడు. పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ఊరంతా పింఛన్ల పండుగ!


దాసేగానూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం, ఆగస్టు 31: కుప్పం ఎంపీడీవో సాయి లహరి మండల వ్యాప్తంగా పంచాయతీలలో తిరుగుతూ పింఛన్లను పంపిణీ చేశారు. సెక్రటరీలు సైతం తమకు కేటాయించిన పంచాయతీల్లో పంపిణీకి శ్రీకారం చుట్టారు. పంచాయతీ సెక్రటరీలు, సచివాలయాల సిబ్బంది అందరూ ఈ కార్యక్రమంలో విస్తృతంగా పాలుపంచుకున్నారు. మరోవైపు కుప్పం పురపాలక సంఘంలో అన్ని వార్డుల్లో పింఛన్ల పంపిణీ సాగింది. టీడీపీ నియోకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు, పార్టీ కుప్పం మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఈ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా పింఛన్లు అందించారు. శాంతిపురం మండలంలో ఎంపీడీవో ఏపీఆర్.కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, విజయరామిరెడ్డి, ఆర్ఎస్.మణి, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పింఛన్ల పంపిణీలో పాలుపంచుకున్నాయి.

## రెండు నెలల్లోనే ఆదర్శవంతమైన అభివృద్ధి

పెద్దపంజాణి, ఆగస్టు 31: అధికారంలోకి వచ్చిన రెండు నెలలోనే ఆదర్శవంతమైన అభివృద్ధి చేశామని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. శనివారం పెద్ద పంజాణి మండలం చలమంగళం పంచాయతీలో ఆయన పర్యటించారు. గ్రామస్తులు ఆయన ఘనస్వాగతం పలికారు. చలమంగళం నుంచి ముద్దేపల్లె మీదుగా లింగాపురం రోడ్డు వరుకు 4.20 కిలోమీటర్లు రోడ్డుకు సంబంధించి రూ2.22 కోట్లతో చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. ముద్దేపల్లె గుట్టపై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి ఆలయం వరకు త్వరలో రోడ్డు అభివృద్ధి చేస్తామన్నారు.

**పింఛన్ల పంపిణీ**

ముద్దేపల్లె, వడ్డూరు, సూలేరుగుట్ట గ్రామాలలో ఆయన పెన్షన్లు అందజేశారు. కాగా కొందరు అర్హులైనా తమకు పెన్షన్ మంజూరు చేయలేదని ఆయన ఎదుట వాపోయారు. సమస్య పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. అదేవిదంగా ఎగువముద్దేపల్లె. దిగువముద్దేపల్లె, వడ్డూరు గ్రామాలకు చౌకదకాణం ఏర్పాటు చేయాలని విన్నవించారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ భాస్కరరెడ్డి, ఎంపీడీవో అబ్దుల్‌రహీం, ఏపీఎం కృష్ణప్ప, నాయకులు పాల్గొన్నారు.

## పాలేటమ్మ మలి జాతరకు ముమ్మర ఏర్పాట్లు


ప్రత్యేక అలంకరణలో పాలేటమ్మ

సోమల, ఆగస్టు 31: నెల్లిమందలో కొలువుదీరిన పాలేటమ్మవారి మలి జాతర నిర్వహించడానికి కమిటీ సభ్యులు ఏర్పాట్లు జోరుగా చేపట్టారు. ఆలయం వద్ద విద్యుత్ అలంకరణలు సాగు తున్నాయి. గ్రామోత్సవాలు పూర్తిచేసుకుని అమ్మవారి ఉత్సవ మూర్తి, పోతురాజులు శనివారం ఆలయం వద్దకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఆలయం వద్ద పుణ్యాహవచన పూజలు చేశారు. ఆదివారం ఉదయం సిద్ధపూజలతో జాతర వేడుకలు ప్రారంభం కాను న్నాయి. రాత్రికి తెట్టుపల్లె, నెల్లిమంద, కమ్మపల్లె, బురుజుపల్లె, బోయపల్లె, గొల్లపల్లె, ముండ్రివారిపల్లె, మఠంగొల్లపల్లె, దాదెంగొల్లపల్లె, కంచెంవారిపల్లె తదితర గ్రామాల నుంచి చాందినీ బండ్లు ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకునేందుకు చర్యలు చేపట్టారు. ఆదివారం రాత్రి పలు గ్రామాల మహిళలు పొంగళ్ల, బోనాలను మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారికి సమర్పించ నున్నారు. ఆలయం వద్ద, చాందినీ బండ్ల వెంట ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందో బస్తు చేపట్టారు.

## కంటివెలుగు శిబిరంలో 613 మందికి చికిత్స


శిబిరానికి హాజరైన వారికి భోజనాలను అందజేస్తున్న నాయకులు, అధికారులు

రామకుప్పం, ఆగస్టు 31: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో రెండు రోజుల పాటు నిర్వహించే కంటివెలుగు కంటిచికిత్స శిబిరాన్ని శనివారం టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ ప్రారంభించారు. ఈ శిబిరంలో మొదటి రోజు 613మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 111మందిని శస్త్ర చికిత్సలకు, 444మందికి అద్దాలు సిఫార్సు చేశారు. వారికి కుప్పం ప్రభుత్వాస్పత్రిలో త్వరలోనే శస్త్రచికిత్సలు చేయిస్తామని, ప్రభుత్వమే అద్దాలు అందిస్తుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు దీప, లోకేశ్, కంటి వైద్యనిపుణులు అర్పిత తెలిపారు. శిబిరానికి హాజరైన వారికి పార్టీ శ్రేణుల సహకారంతో నేతలు భోజనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు బాబు, ఎంపీడీవో ఈశ్వరన్న, నాయకులు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## కనువిందుగా ఓబులేశ్వరస్వామి కల్యాణోత్సవం



బైరెడ్డిపల్లె, ఆగస్టు 31 : మండలంలోని మురారిపల్లె గ్రామంలో వెలసిన ఓబులేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామివారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అర్చకులు తిప్పయ్యాచార్యులు, శ్రీనివాసాచార్యులు స్వామి వారి ఉత్సవమూర్తులకు విశేషాలంకరణ గావించి శాస్త్రోక్తంగా వేద మంత్రాలతో కల్యాణోత్సవాన్ని జరిపించారు. పరిసర గ్రామాలనుంచి పలువురు భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించున్నారు. సాయంత్రం స్వామివారిని గరుడ వాహనంపై కొలువుదీర్చి మేళతాళాల మధ్య గ్రామంలో ఊరేగించారు.

## వైభవంగా వేణుగోపాలుడి రథోత్సవం



వి.కోట, ఆగస్టు 31: మండలంలోని గుమ్మిరెడ్డి పల్లె సమీపంలో వెలసిన కృష్ణమ్మ కొండపై శ్రావణ శనివారోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసాన్ని పురస్కరించుకుని కొండపై వెలసిన రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి వారికి ఉదయాన్నే మేల్కొలుపు సేవ, వివిధరకాల అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకిపై కొలువు దీర్చి ఆలయం చుట్టూ ఊరేగించారు. ఆలయ కమిటీ కోలాటాలు, పండరి భజనలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారిని అత్యంత భక్తిశ్రద్ధలతో పల్లకిని మోసేందుకు భక్తులు ఆసక్తి చూపారు. గుమ్మిరెడ్డిపల్లె పరిసర గ్రామాల ప్రజలకు, భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాలకు చెందిన భక్తులు తరలిరావడంతో కృష్ణమ్మ కొండ భక్తులతో కిక్కిరిసింది.

## సంపద కేంద్రాలు వినియోగంలోకి తీసుకురావాలి

● వీధుల్లోని ఆక్రమణలు తొలగించాలని డీపీవో ఆదేశం


గ్రామస్తులతో మాట్లాడుతున్న డీపీవో లక్ష్మి

కల్లూరు, ఆగస్టు 31: మండలంలోని (ఎస్‌డబ్ల్యూపీసీ) చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా పంచాయతీ అధికారి టి.లక్ష్మి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులతో డీపీఓ సమావేశం నిర్వహించారు. దేవళంపేట పంచాయతీ మర్రికుంట వారిపల్లిలో వీధులు ఆక్రమణకు గురయ్యాయని గ్రామానికి చెందిన వెంకటాచలం అనే వ్యక్తి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ముందుగా డీపీవో లక్ష్మి గ్రామాన్ని సందర్శించారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో వీధుల్లోని ఆక్రమణలు తొలగించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం కల్లూరు పంచా యతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ మండలంలో పారిశుధ్యం లోపించకుండా పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రీన్ అంబాసిడర్ల జీతాలు సక్రమంగా చెల్లించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని, పారిశుధ్యంపై ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. ఎంపీడీవో రాజశేఖర్‌బాబు, ఈఓపీఆర్‌డీ యుగంధర్ పాల్గొన్నారు.

## లింగధీరుల అలంకరణలో శనేశ్వరుడు


నృత్యాలు చేస్తున్న లింగధీరులు

పుంగనూరు రూరల్, ఆగస్టు31: పట్టణ సమీపంలోని పుంగమ్మ చెరువు మార్గంలో వెలసిన శనేశ్వరస్వామి శనివారం లింగధీరుల అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ అర్చకులు ఉదయాన్నే స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. శ్రావణ శనివారం కావడంతో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. అలాగే కర్ణాటక రాష్ట్రం చిక్‌బాళ్లాపురానికి చెందిన లింగధీరులు తమ ఖడ్గాలతో మంగళవాయిద్యాల నడుమ నృత్యాలు చేసి భక్తులను ఆకట్టుకున్నారు.

## మండల సమాఖ్య కమిటీ ఏర్పాటు

సోమల, ఆగస్టు 31: సోమల మండల సమాఖ్య నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఏపీఎం శివ తెలిపారు. అధ్యక్షురాలిగా భార్గవి, కార్యదర్శిగా కావ్య, కోశాధికారిగా మణికుమారి, ఉపాధ్యక్షురాలుగా కోమల, ఉప కార్యదర్శిగా సుప్రియలను సభ్యులు ఎన్ను కున్నారు. వారికి విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు.

## పాఠ్యపుస్తకాల పంపిణీ

రొంపిచెర్ల, ఆగస్టు31: మండలంలోని 37 పాఠశాలల విద్యార్థులకు సంబంధించి సెకండ్ సెమిస్టర్ పాఠ్య పుస్తకాలు 5107 ఎమ్మార్సీకి వచ్చినట్లు ఎంఈవో-2 శ్రీనివాసులు తెలిపారు. శనివారం పాఠశాల హెచ్‌ఎంలకు సైన్స్, సోషియల్, గణితం పుస్తకాలు పంపిణీ చేశారు.

## ఒకరోజు ముందే పింఛన్ల పంపిణీ


పెన్షన్ల పంపిణీలో టీడీపీ నాయకులు షేక్‌కరీముల్లా

రొంపిచెర్ల, ఆగస్టు31: సెప్టెంబరు ఒకటో తేదీ ఇవ్వాల్సిన పింఛన్లు ఒకరోజు ముందే ఇవ్వడంతో పెన్షనర్లలో ఆనందం వెల్లివిరిసిందని రాజంపేట పార్లమెంట్ టీడీపీ నాయకులు జి.ఇమ్రాన్‌ఖన్, షేక్ కరీముల్లా అన్నారు. శనివారం రొంపిచెర్ల పంచాయతీలో పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌస్‌పీర్‌ఖాన్, రామమూర్తి, హరిబాబు, సయ్యద్ బాష, హయద్‌బాష పాల్గొన్నారు.

**సోమల:** మండలంలో టీడీపీ నాయకులు సచివాలయ ఉద్యోగులతో కలసి శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. పొలాల వద్దకు వెళ్లి కూడా పంపిణీ చేశారు. మిట్టపల్లెలో టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, గట్టువారి పల్లెలో జనసేన మండల అధ్యక్షుడు నాగభూషణం, పెద్ద ఉప్పరపల్లెలో మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, ఇరికిపెంటలో శ్రీనివాసులు నాయుడు, భానుప్రకాశ్, సోమలలో శివశంకర్, మహేంద్రబాబు, బురుజుపల్లెలో కొల్లా హరిప్రసాద్ పంపిణీ చేశారు.

## సదుంలో 90 శాతం పంపిణీ

సదుం, ఆగస్టు 31: సదుం మండలంలో ఉదయం 6 గంటల నుంచి పింఛన్లు పంపిణీ చేశారు. ఉదయం 10 గంటలకే 90 శాతం పంపిణీ పూర్తి చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో వరప్రసాద్ పర్యవేక్షించారు. సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరిస్తా

రొంపిచెర్ల, ఆగస్టు31: మండలంలోని ప్రజలు, రైతుల భూసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం బాధ్యతలు స్వీక రించిన తహసీల్దార్‌ను టీడీపీ మండల అధ్యక్షుడు ఉయ్యాల రమణ, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు నియోజకవర్గం తెలుగు యువత ఉపాధ్యక్షుడు నాగిశెట్టి నాగరాజ, దళిత నాయకుడు ఈశ్వరయ్య, నాగార్జున నాయుడు, గోవర్దన్‌రెడ్డి, బాబులాల్, అంజాద్‌ఖాన్, కరీముల్లా, తులసీరాం పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు తప్పవు

గుడుపల్లె, ఆగస్టు 31: హోటళ్లలో ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు తీసుకొంటామని ఎంపీడీవో తాజ్ మన్సూర్ హోటల్ నిర్వాహకులను హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలువురు ప్రజలు హోటళ్లలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్లు వాడుతున్నారని ఫిర్యాదు చేయడంతో ఎంపీడీవో, కార్యదర్శిలతో కలిసి శనివారం పలు హోటళ్లను తనిఖీ చేశారు. అనంతరం హోటల్ నిర్వాహకులకు ప్లాస్టిక్ కవర్లు వాడరాదని నోటీసులు జారీ చేశారు.

## దళిత అధికారిని వైసీపీ అడ్డుకుంటోంది

బైరెడ్డిపల్లె, ఆగస్టు 31 : బైరెడ్డిపల్లె ఎంపీడీవోగా త్వరలో దళిత అధికారి రానున్నారని తెలిసి కొందరు వైసీపీ ప్రజాప్రతినిధులు అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారని మండల దళిత సంఘ నాయకులు బీవో సుబ్రమణ్యం, చలపతి, సుబ్రమణ్యం, రమణ, బాబు తదితరులు ఆరోపించారు. బైరెడ్డిపల్లెలో వారు శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఇలాంటి ప్రయత్నాలను మానుకోకుంటే త్వరలో తాము ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు.

## విద్యుత్‌షాక్‌తో టైలర్ మృతి


రమేశ్ (ఫైల్‌ఫొటో)

పుంగనూరు రూరల్, ఆగస్టు 31: విద్యుత్ షాక్‌తో ఓ టైలర్ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మండలంలోని ఈడిగపల్లెకు చెందిన రమేశ్(35) టైలర్. శుక్రవారం సాయంత్రం ఇంటి ముందు ఏర్పాటు చేసిన నీటి తొట్టికి మోటర్ ఏర్పాటు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురయ్యాడు. కుటుంబసభ్యులు అన్నమయ్య జిల్లా మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## గుడుపల్లెలో 96.21 శాతం పంపిణీ

గుడుపల్లె, ఆగస్టు 31: మండలం టీడీపీ, జనసేన నాయకులు సచివాలయ ఉద్యోగులతో కలిసి శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. మొత్తం 5698 పింఛన్ల గాను 5477 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో తాజ్ మన్సూర్ తెలిపారు. నియోజకవర్గ సమన్వయ కన్వీనర్ చంద్రశేఖర్, టీడీపీ మండల అధ్యక్షులు బాబు సోడిగానిపల్లెలో, టీడీపీ ప్రధాన కార్యదర్శి భానుమూర్తి కాడేపల్లెలో, జనసేన మండలాధ్యక్షుడు అమీర్ గుండ్ల సాగరంలో, మండల బీసీ సెల్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ గుత్తార్లపల్లెలో, క్లస్టర్ ఇన్‌చార్జి హేమాంబర్ గౌడ్ అగరంలో, మాజీ జడ్పీటీసీ బేటప్ప, ఓఎన్ కొత్తూరులో, మాజీ ఎంపీపీ మునిరాజు బెగ్గిలపల్లెలో పింఛన్లు పంపిణీ చేశారు.

# చిత్తూరు

## జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

## పచ్చదనం పెంపునకు ప్రభుత్వం కంకణం



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే మురళి

చిత్తూరు, ఆగస్టు 31: వనం-మనం కార్యక్రమంలో భాగంగా శనివారం దారసరాపల్లె పంచాయతీలోని రంగనాథస్వామి దేవస్థానం వద్ద శనివారం ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ కొబ్బరి మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనాన్ని పెంచాలనే ఉద్దేశంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కంకణం కట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో సహాయ పథక సంచాలకులు సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో శివరాజ్, తహసీల్దార్ పార్థసారథి, ఏపీవో బాల, టెంపుల్ ఈవో సుబ్రహ్మణ్యం, స్థానిక నేత హేమగిరి, సర్పంచ్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## కొట్టుకుపోయిన కల్వర్టు : రాకపోకలకు ఇబ్బంది



పాలసముద్రం, ఆగస్టు 31: మండలంలోని నరసింహాపురం నుంచి నరసింహాపురం బీసీ కాలనీకి వెళ్ళేందుకు నిర్మించిన కల్వర్టు నెలరోజుల భారీవర్షానికి కొట్టుకుపోయింది. కాలనీలో 40 కుటుంబాలు నివసిస్తున్నాయి. రాకపోకలు సాగించాలంటే కాలువలో దిగి వెళ్ళాల్సి వస్తోంది. ఇక్కడ సుమారు సంవత్సరం క్రితం బ్రిడ్జి నిర్మించారు. వర్షానికి ముళ్ళకంపలు ఎక్కువగా వచ్చి బ్రిడ్జి రంధ్రాలు మూసుకుపోవడంతో వర్షపు నీరు పక్కనున్న గట్టు కోసేసింది. ప్రస్తుతం వర్షపునీరు కొద్దిగా ఈ గట్టు పక్కనే పారుతోంది. బీసీ కాలనీకి ద్విచక్ర వాహనాలు వెళ్ళాలన్నా కుదరడంలేదు. ఇక్కడ బ్రిడ్జికి మరమ్మతులు చేసి గట్టును పటిష్ట పరచాలని ప్రజలు కోరుతున్నారు.

## అన్నదానానికి బియ్యం, కూరగాయల వితరణ



ఐరాల(కాణిపాకం) ఆగస్టు 31, కాణిపాకంలో ఆలయంలో అన్నదాన కార్యక్రమానికి తవణంపల్లె మండలం మైనగుండ్లపల్లెకు చెందిన అంజిరెడ్డి బృందం శనివారం బియ్యం, కూరగాయలను విరాళంగా అందించినట్లు ఇన్‌చార్జి ఈవో వాణి తెలిపారు. దాతలు 200 బస్తాలు(25 కేజీలు) బియ్యం, కూరగాయలను విరాళంగా అందించారన్నారు. దాతలను ఆలయ మర్యాదలతో స్వామి దర్శనభాగ్యం కల్పించారు. వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ స్టోర్ ఇన్‌చార్జి బాలాజీనాయుడు, కాణిపాకం పంచాయతీ మాజీ సర్పంచ్ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం: ఎమ్మెల్యే

గుడిపాల, ఆగస్టు 31: రోడ్డు ప్రమాదంలో మరణించిన రామభద్రాపురం పంచాయతీ చుక్కావారిపల్లెవాసి గణపతి మృతదేహానికి శనివారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్ నివాళులర్పించారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. గణపతి మృతి తమ పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ సీనియర్ నాయకులు చెన్నకేశవులు నాయుడు, బాలాజీ నాయుడు, హేమాద్రి నాయుడు, మురళీ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల ఆటల పోటీల ప్రారంభం



క్రీడలను ప్రారంభిస్తున్న ఎంఈవో

వెదురుకుప్పం, ఆగస్టు 31: గురుపూజోత్సవం సందర్భంగా శనివారం కార్వేటినగరంలో ఉపాధ్యాయులకు ఆటల పోటీలను నిర్వహించారు. పోటీలను ఎంఈవో మంచికాయల వి జయకుమార్ ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఈనెల 5న విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులకు సన్మానం



గుడిపాల, ఆగస్టు 31: మండలంలోని ఉద్యోగ విరమణ చేసిన పలువురు ఉపాధ్యాయులు, సిబ్బందిని ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. శనివారం నరహరిపేట జడ్పీ హైస్కూల్‌లో ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడు భాస్కర్ నాయుడును జీజేఎం ఛారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకుడు చెన్నకేశవులు నాయుడు, ఎంపీటీసీ గోళ్ళ హరిప్రసాద్ చౌదరి సత్కరించారు. అనంతరం బొమ్మసముద్రం హైస్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావును మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, ఉపాధ్యాయులు సత్కరించారు. ఎంఈవో గణపతి, ప్రధానోపాధ్యాయురాండ్రు ఖాతుంబీ, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలు అరికట్టాలని నగరిలో ర్యాలీ



నగరి, ఆగస్టు31: మాదకద్రవ్యాల వాడకాన్ని అరికట్టాలని నగరిలో శనివారం నగరి ఓంశక్తి గుడి నుంచి టవర్‌క్లాక్ వరకు ఆలిండియా తౌహిద్ జమాత్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాల వాడకంతో యువత భవిత నిర్వీర్యమవుతోందని, మత్తుపానీయాల ఆదాయంతో ప్రభుత్వాలు నడపాలనుకోవడం సిగ్గు చేటంటూ నినాదాలు చేశారు. మాదకద్రవ్యాల రవాణా, వినియోగాల కట్టడికి ప్రతి ఒకరు శాయశక్తులా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య,అంబేడ్కర్ సంఘంనాయకులు గోవిందస్వామి, ఆల్ ఇండియా తౌహిత్ జమాత్ సభ్యులు, స్థానిక యువతీయువకులు పాల్గొన్నారు.,

## 3న ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా

చిత్తూరు, ఆగస్టు 31: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంటు ఎక్ఛేంజ్, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా ఈ నెల 3న స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాల వద్ద జాబ్‌మేళా నిర్వహించనున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో పలు కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ 18-35 సంవత్సరాల వయస్సు మధ్య ఉన్నవారు అర్హులన్నారు. ఈ జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సహాయ కమిషనర్‌గా ప్రసాద్ బాధ్యతల స్వీకరణ



చిత్తూరు, ఆగస్టు 31: మున్సిపల్ కార్పొరేషన్ సహాయ కమిషనర్‌గా అవినేని ప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు నగర పాలక సంస్థ టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్‌గా పనిచేసిన ఈయన బదిలీల్లో భాగంగా చిత్తూరుకు వచ్చారు. సహాయ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయనకు ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

## నేడు చిత్తూరులో మారథాన్

చిత్తూరు రూరల్, ఆగస్టు 31: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా ఎయిడ్స్ నివారణ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు 2.5 కే, 5 కే మారథాన్ నిర్వహించనున్నట్లు టీబీ, ఎయిడ్స్ నివారణ అధికారి వెంకటప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 5.30 గంటల నుంచి 7.30 వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల పాల్గొంటారన్నారు. మెసానికల్ మైదానం నుంచి పీవీకేఎన్ వరకు మారథాన్ జరుగుతుందన్నారు. గెలుపొందిన వారికి నగదు బహుమతి ఉంటుందని వివరించారు.

## కారు ఢీకొని ఒకరి దుర్మరణం



మృతుడు మక్బూది ఆలీ

చిత్తూరు, ఆగస్టు 31: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి చనిపోయాడు. ట్రాఫిక్ సీఐ నిత్యబాబు వివరాల మేరకు... కొంగారెడ్డిపల్లెకు చెందిన మక్బూది ఆలీ(55) స్థానికంగా చికెన్‌షాపులో పనిచేసేవాడు. ఈ క్రమంలో శనివారం కొంగారెడ్డిపల్లె నుంచి ఎంఎస్ఆర్ సర్కిల్ వెళుతుండగా ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్ వద్ద వెనుక వస్తున్న ఓ కారు ఢీకొంది. మక్బూది ఆలీ ముక్కు, చెవుల నుంచి తీవ్ర రక్తస్రావం జరిగింది. చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు.

## పౌరహక్కులపై అవగాహన

వెదురుకుప్పం, ఆగస్టు 31: అంటరానితనం, కుల వివక్ష వంటివి ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ రమేష్ కోరారు. కేఎన్‌పెంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో విద్యార్థులకు శనివారం పౌరహక్కులపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో హరినాథ్‌బాబు నాయుడు, ఏపీవో ఇందు, ఏఈ మురళి, వీఆర్వో శాంబశివారెడ్డి, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు హాజరయ్యారు.

## డ్రాప్ అవుట్స్ చేరికపై ప్రత్యేక దృష్టి

బంగారుపాళ్యం, ఆగస్టు 31: మండలంలోని తగ్గువారిపల్లె అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం జిల్లా సమగ్రశిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి వెంకటరమణరెడ్డి సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక దృష్టి పెట్టి డ్రాపౌట్స్‌ను గుర్తించి పాఠశాలలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు నాగేశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఆర్ట్స్, సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షుడిగా జయచంద్ర

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 31: జిల్లా ఆర్ట్స్, సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులుగా శీలా జయచంద్రను నేషనల్ ఆర్ట్స్ సాంస్కృతిక సమాఖ్య నియమించింది. శనివారం శీలా జయచంద్రకు నియామకపత్రాలను అందజేశారు.

## రిటైర్డ్ టీచరుకు వీడ్కోలు

బంగారుపాళ్యం, ఆగస్టు 31: కొత్త వెంకటాపురం ప్రాథమిక పాఠశాలలో ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడు కన్నయ్యను ఎంఈవోలు నాగేశ్వరరావు, రమేష్, ఉపాధ్యాయులు శనివారం సన్మానించారు. ఆయన చేసిన సేవలను వక్తలు కొనియాడారు.

## 'శిఖండి'తో సామాజిక సందేశం

చిత్తూరు సిటీ, ఆగస్టు31: శిఖండి సినిమాను సామాజిక సందేశంతో నిర్మించినట్లు ఆ సినిమా కథానాయకుడు, దర్శకుడు, నిర్మాత కోడి కిషోర్ చెప్పారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో సినిమా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేకే ఫిలిమ్స్ సమర్పణలో ప్లాస్టిక్ మహమ్మారిని నిర్మూలించాలనే సందేశంతో సినిమా నిర్మించామన్నారు. స్థానిక నటీనటులతో చిత్రాన్ని నిర్మించామన్నారు. సెప్టెంబర్ చివరిలో గాని అక్టోబర్ మొదటి వారంలోగాని విడుదల చేస్తామన్నారు.

# నిరుపేదలకు అండగా కూటమి ప్రభుత్వం



చిత్తూరులో ఎమ్మెల్యే జగన్మోహన్, దాసరాపల్లెలో ఎమ్మెల్యే మురళీమోహన్,గుండ్రాజుకుప్పంలో టీడీపీ నేతల పింఛన్ల పంపిణీ

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 31: పేదలకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తోందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల కార్యక్రమంలో భాగంగా శనివారం పలు ప్రాంతాల్లో ఆయన వృద్ధులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృద్ధులకు ఇబ్బందులు రాకుండా ఉండేందుకు ఒక రోజే ముందే పింఛన్లు పంపిణీ చేయడం దేశ చరిత్రలో ఇదే ప్రథమమన్నారు. కార్యక్రమంలో మేయర్ ఆముద, మాజీ మేయర్ కఠారి హేమలత, అరుణ, టీడీపీ నాయకులు మారుతి, సునీల్‌కుమార్ పాల్గొన్నారు. 38వ డివిజన్‌లో టీడీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు వైపీ రాజేశ్వరీ, 37వ డివిజన్‌లో బీజేపీ సెంట్రల్ అధ్యక్షుడు షణ్ముగం, 28వ డివిజన్‌లో టీడీపీ వార్డు కార్యదర్శి నిరంజన్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, శేఖర్, ఏలుమలై ఆధ్వర్యంలో వృద్ధులకు పింఛన్ల పంపిణీ చేశారు. **నిండ్ర:** మండలంలో సచివాలయ ఉద్యోగులు పింఛన్లను పంపిణీ చేశారు. లేవలేనిస్థితిలో ఉన్నవారికి ఇంటికే వెళ్లి అందజేశారు. పలుచోట్ల టీడీపీ నాయకులు పాల్గొన్నారు. **ఐరాల:** మండలంలో శనివారం 9,948 మంది లబ్ధిదారులకు గాను 9,634 మందికి పింఛన్లను అందచేశారు. మిగిలిన వారిఇకి పంపిణీ చేయాల్సి ఉందని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. **నగరి:** పింఛన్ల పంపిణీలో 97.1 శాతంతో నగరి మండలం జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచిందని ఇన్‌చార్జి ఎంపీడీఓ సతీష్ తెలిపారు. సాయంత్రానికి 5431 మందికి పంపిణీ చేసిన సచివాలయ సిబ్బంది, వీఆర్ఓలు, కార్యదర్శులు, ఫీల్డ్ సిబ్బందిని ఆయన అభినందించారు. **గంగాధర నెల్లూరు:** నెల్లేపల్లె సచివాలయంలో ఉద్యోగులతో కలిసి జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్ టీడీపీ జిల్లా నేత శ్రీధర్ యాదవ్ పింఛన్లు పంపిణీ చేశారు. **శ్రీరంగరాజపురం:** క్షీరసముద్రంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ పంపిణీ చేశారు.

## సమాచారం లేకుండా పనులు చేపడితే ఎలా?

### అధికారులను నిలదీసిన నగరి మున్సిపల్ కౌన్సిలర్లు



సమావేశంలో ప్రసంగిస్తున్న మున్సిపల్ చైర్మన్ నీలమేఘం

నగరి, ఆగస్టు31: అభివృద్ధి పనులకు సంబంధించి తమకు సమాచారం తెలియడంలేదని పలువురు కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం నగరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. పనులు పూర్తయ్యాక మంజూరుకు మున్సిపల్ అమోదమా? ఇదెక్కడి చోద్యమంటూ సభ్యులు అధికారులను నిలదీశారు. అన్న క్యాంటీన్ భవనానికి మరమ్మతు పనులు పూర్తయ్యాక పనుల మంజూరు కోరుతూ ప్రతిపాదించడం ఏమిటంటూ కౌన్సిలర్ దయానిధి ప్రశ్నించారు. వైస్‌చైర్మన్ వెంకటరత్నంతో పాటు మరికొందరు అధికారుల వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది తమను అవమానించడమేనని వ్యాఖ్యానించారు. పనులు ఎవరు చేసినా పర్వాలేదు గాని సమాచారమిస్తే చాలని వీరు పేర్కొన్నారు. సంత మైదానం ఆవరణలో ఆపేసిన మార్కెట్ గదుల నిర్మాణం చేపడతారా?లేదా? అని కౌన్సిలర్ భాస్కర్ ప్రశ్నించారు. రెండో విడత నిధులు చెల్లిస్తే పనులు ప్రారంభిస్తామని డీఈఈ నరేష్ వివరించారు. ఇకపై అత్యవసర పనులు చేపట్టాలంటే సమావేశం ఏర్పాటు చేసి కౌన్సిల్ అనుమతులు పొందాకే చేపడతామన్నారు. కమిషనర్ మంజునాథ్‌గౌడ్ ,ల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## కేంద్ర సబ్సిడీతో ఇళ్లకు సోలార్ విద్యుత్ సౌకర్యం



ముత్తంరాజా

గంగాధరనెల్లూరు, ఆగస్టు 31: కేంద్ర ప్రభుత్వ సబ్సిడీతో సోలార్ విద్యుత్ సౌకర్యం ఏర్పాటుచేసుకోవచ్చునని స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ ముత్తంరాజా తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకం కింద దిగువ, మధ్యతరగతి ఈ సౌకర్యం కల్పిస్తోందన్నారు. నెలకు 150 యూనిట్లులోపు వాడేవారు 1 నుంచి 2 కిలోవాట్ల సామర్థ్యమున్న సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.30వేల నుంచి రూ.60వేల సబ్సిడీ ఇస్తోందన్నారు. 150 నుంచి 300 యూనిట్లలోపు వాడేవారు 2 నుంచి 3 కిలోవాట్ల రూఫ్‌టాప్ ఏర్పాటుకు రూ. 60వేల నుంచి రూ. 78వేల వరకు సబ్సిడీ ఇస్తోందన్నారు. 300 యూనిట్ల వారికి రూ.78వేలు సబ్సిడీ పొందవచ్చునన్నారు. ఆన్‌లైన్ నేషనల్ పోర్టల్ https://pmsuryaghar.gov.inIZ వివరాలు అప్‌లోడ్ చేయవచ్చునన్నారు. దరఖాస్తు చేయడానికి డాక్యుమెంటేషన్ సరళీకృతం చేశారన్నారు. వ్యక్తిగత లేదంటే గ్రూపు ఇళ్లకు పథకం వర్తిస్తుందన్నారు. కిలోవాట్ సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు సుమారుగా భవనం మీద 10 చదరపు మీటర్ల స్థలం ఉండాలన్నారు. కిలోవాట్ సోలార్ ప్యానెల్ నెలకు 125 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుందని పేర్కొన్నారు.

## జిల్లా ఇంటర్ జోనల్ క్రీడోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

పూతలపట్టు, ఆగస్టు 31: చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే మురళీమోహన్ కోరారు. పూతలపట్టు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా ఇంటర్ జోనల్స్ క్రీడాఉత్సవాల పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన వారికి ఆర్థిక సహాయం చేస్తామన్నారు. డీఈవో దేవరాజ్, డీవైఈవో చంద్రశేఖర్, క్రిష్ణయ్య, మోహన్ రెడ్డి, టీడీపీ నాయకులు దొరబాబు చౌదరి, గిరిధర్ బాబు, గుంటూరు మురళి, ప్రతాపనేని చంద్రమౌళి, హరి, నేతాజీ, విజయలక్ష్మి, మంజునాథ్, అర్జున్ పాల్గొన్నారు.

## ఉపాధి కూలీల సంఖ్య పెంపునకు చర్యలు



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి

పెనుమూరు, ఆగస్టు 31: ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని తాటిమాకులపల్లి పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. రోజూ రూ.272 వచ్చే విధంగా పనులు చేయాలని సూచించారు. పొలంలో బౌండరీ ట్రేంచ్, పండ్లతోటల పెంపకం వంటి పనులకు పథకం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఏపీవో గుణశేఖర్ పాల్గొన్నారు.

## దారి సమస్యపై చీమలపల్లి గ్రామస్తుల నిరసన



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నయ్య

గుడిపాల, ఆగస్టు 31: హైవే నిర్మాణంలో తమకు అసౌకర్యం కల్పిస్తున్నారంటూ మండలం చీమలపల్లి గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల తీరును నిరసిస్తూ శనివారం రాత్రి వారు హైవైపై బైఠాయించారు. తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో ఆంధ్రకు వెళ్లాల్సిన రహదారిని మూసివేశారంటూ నిరసన వ్యక్తంచేశారు. తమ గ్రామానికి వచ్చే రహదారికి కేవలం పన్నెండు అడుగులు విడిచిపెట్టడం సరికాదన్నారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో చిన్నయ్య చేరుకున్నారు. పోలీసులు,రెవెన్యూ అధికారులు కూడా చేరుకున్నారు. గ్రామస్థులతో ఆర్డీవో మాట్లాడారు. రహదారి సమస్యపై అధికారులతో చర్చించి న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.

## పెద్ద బాలశిక్ష పుస్తకావిష్కరణ

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 31: తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో శనివారం డీఈవో దేవరాజ్ పెద్దబాలశిక్ష పుస్తకాన్ని ఆవిష్కరించా. ఇలాంటి పుస్తకాలు విద్యార్థులకు అందజేయడం ఎంతో ప్రయోజనకరమన్నారు. కార్యక్రమంలో పుస్తకం ముద్రించిన కొలమాసనపల్లి పాఠశాల హెచ్ఎం ఈశ్వర్ ప్రసాద్, తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు, బాలసుందరం, ప్రసాద్ పాల్గొన్నారు.

## వన వేణుగోపాలస్వామికి క్షీరాభిషేకం



వెదురుకుప్పం, ఆగస్టు 31: దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలోని వన వేణుగోపాల స్వామికి శనివారం క్షీరాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన అర్చకులు కె.కార్తీక్ అయ్యంగార్ ప్రత్యేక పూజలు నిర్వహించి, అలంకరించారు. పరిసర గ్రామాల భక్తులు అక్కడి చేరుకుని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలను అందజేశారు. మధ్యాహ్నం అన్నప్రసాదం చేశారు. కార్వేటి నగరంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో. అర్చనలు, అభిషేకాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## లక్ష్మీ నరసింహస్వామికి విశేష పూజలు

వెదురుకుప్పం, ఆగస్టు 31: చిన్నమరెడ్డికండ్రిగలో లక్ష్మీ నరసింహస్వామికి శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామిని తులసి దళాలు, సుగంధభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ధర్మకర్త మిట్టపల్లి మంజుల, సుబ్రహ్మణ్యం దంపతులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి : బీజేపీ

వెదురుకుప్పం, ఆగస్టు 31: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాముల శేషాద్రికుమార్ కోరారు. శనివారం దేవళంపేటలో పార్టీ ముఖ్యనాయకులతో కలసి మాట్లాడారు. శేషాద్రికుమార్ మాట్లాడుతూ పార్టీ సానుభూతిపరులందరితో సభ్యత్వ నమోదు చేయించడంలో నాయకులు కీలకపాత్ర పోషించాలన్నారు. ఆయన వెంట బూత్ కమిటీ అధ్యక్షులు మునస్వామి, నాయకులు రేశయ్య, రాములయ్య, ప్రకాష్, మోహన్ పాల్గొన్నారు.

## పవన్ జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు

చిత్తూరు సిటీ, ఆగస్టు 31: ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆపార్టీ సీనియర్ నేత ఆరణి శివకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం లక్ష్మీనగర్ కాలనీలోని జనసేన కార్యాలయంలో ఉదయం రక్తదాన కార్యక్రమం నిర్వహిస్తారన్నారు.



## మండపాలకు ఆంక్షలు లేని అనుమతులివ్వాలి

● అధికారులకు నగర గణేష్ ఉత్సవ సమితి వినతి



మాట్లాడుతున్న గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు రామభద్ర

చిత్తూరు సిటీ, ఆగస్టు 31: వినాయక చవితి మండపాలకు ఆంక్షలులేకుండా అనుమతులివ్వాలని నగర గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు ఎంజి రామభద్ర కోరారు. శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో అధికారులు ఆంక్షలు లేని అనుమతులివ్వాలన్నారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించే పండుగకు అధికారులు సహకరించాలన్నారు. నిర్వాహకులు మండపాలవద్ద భక్తి భావం ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఉత్సవ సమితి సభ్యులు తోటపాళ్యం వెంకటేష్, గోళ్ళ హరిప్రసాద్ చౌదరి, కరుణాకర్ సిద్దూ, వేలు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.3 లక్షల విలువైన ఇనుప రేకుల చోరీ

బంగారుపాళ్యం, ఆగస్టు 31: చెన్నై -బెంగళూరు జాతీయ రహదారి ఎక్స్‌ప్రెస్ హైవే పనుల వద్ద శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు సుమారు రూ.3 లక్షలు విలువచేసే ఇనుప రేకులు చోరీ అయ్యాయి. ఎక్స్‌ప్రెస్ హైవే మేనేజర్ ఈమేరకు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మల్లప్ప తెలిపారు.

## ఆలయాల్లో భక్తి ప్రపత్తులతో ప్రదోష పూజలు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 31: నగరంలోని శివాలయాల్లో శనివారం శని త్రయోదశి పూజలను భక్తులు అత్యంత భక్తిప్రపత్తులతో నిర్వహించారు. గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వరాలయంలో స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించి విశేష అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. కట్టమంచి కులందేశ్వరా, శ్రీ కామాక్షి అంబికా సమేత అగస్థీశ్వర, చవటపల్లె నాగలమ్మ ఆలయాల్లో శని త్రయోదశి పూజలను భక్తులు చేసారు. ఈ కార్యక్రమాల్లో ఆలయాల నిర్వాహకులు, అర్చకులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. **వెదురుకుప్పం:** కార్వేటినగరంలోని సదాశివేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం నందీశ్వరుని ప్రదోష కాల పూజలు జరిగాయి. అలాఘే సదాశివేశ్వరస్వామికి పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు భక్తులు హాజరయ్యారు. కమిటీ అధ్యక్షులు మోహన్‌రాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## చినుకు పడితే ప్రసూతి వార్డు జలమయం

● ఏడాదిగా పైకప్పునకు చేపట్టని మరమ్మతులు



ప్రసూతివార్డు ఫ్లోరింగ్‌పై వర్షపు నీరు

చిత్తూరు రూరల్, ఆగస్టు 31: తేలికపాటి వర్షం వస్తే చాలు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలోని ప్రసూతివార్డులో జలమయమవుతోంది. రెండేళ్ల క్రితం వార్డులోని పైకప్పు గాలివానకు కొట్టుకుపోయింది. అప్పటి నుంచి చిన్నపాటి వర్షం వచ్చినా నీరు వార్డును ముంచెత్తుతుంది. గతం సంవత్సరం భారీ వర్షానికి వార్డు లోపలికి కూడా నీరు రావడంతో బాలింతలను వేరే గదికి మార్చాల్సి వచ్చింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు కూడా పైకప్పునకు మరమ్మతు చేయలేదు. వార్డు బయట బాలింతలు, గర్భిణుల కోసం సహాయకులు సేదతీరుతుంటారు. వర్షం పడ్డ ప్రతీసారీ కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షపునీరు వార్డు బయట నిలిచి ఉండడం ద్వారా ఉష్ణోగ్రత ప్రమాణం పడిపోతుండడంతో బాలింతలు కూడా ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే మరమ్మతులు చేయాలని రోగులు కోరుతున్నారు.